క్లుప్తంగా

16 నుంచి పార్థివలింగ, ప్రాణ లింగ ప్రతిష్ఠాపనోత్సవం

జగద్గిరిగుట్ట: డివిజన్ పరిధిలోని అంజయ్యనగర్‌లో ఉన్న భ్రమరాంబిక సమేత శ్రీమల్లికార్జున స్వామి దేవాలయంలో ఈనెల 16వ తేదీ నుంచి 18వ తేదీ వరకు కోటి పార్థివలింగ, ప్రాణ లింగ సహిత కాలభైరవ ప్రతిష్ఠాపన మహోత్సవ కార్యక్రమం చేపట్టనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది. ఈనెల 16వ తేదీన గణపతి పూజ, పుణ్యాహవాచకం, రక్షాబంధనం, జలాదివాసం, 17వ తేదీన అగ్ని ప్రతిష్ఠ, రుద్రహోమం క్షీరాభివాసం, నిత్య పూర్ణాహుతి, ద్వారతోరణ పూజ, బలిహారణ, 18వ తేదీన హోమాలు, యంత్ర ప్రతిష్ఠ, కోటి పార్థివలింగ ప్రతిష్ఠాపన, సుగంధ ద్రవ్యరసాభిషేకం ఉంటుందని పేర్కొంది. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

ఇంటర్ పరీక్షలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలి

చింతల్: ఇంటర్ పరీక్షల నేపథ్యంలో ఈనెల 15 నుంచి ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేయాలని ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గొల్లజాన్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం జీడిమెట్ల బస్‌డిపో మేనేజర్ విజయ్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. గాజులరామారం తదితర ప్రాంతాలలో విద్యార్థులకు ఎక్కువగా సమస్య ఉందని వినతిలో పేర్కొన్నారు.

రద్దీ ప్రాంతాల్లో మాస్కులు ధరించాలి

చింతల్: కోవిడ్ విషయంలో ప్రజలు జాగ్రత్తగా ఉండాలని బహిరంగ ప్రదేశాలు, రద్దీగా ఉండే ప్రాంతాలలో మాస్కులు ధరించాలని కుత్బుల్లాపూర్ మండల వైద్యాధికారిణి డాక్టర్ నిర్మల కోరారు. శుక్రవారం యుపీహెచ్‌సీలో కోవిడ్ టెస్టులు నిర్వహించగా అందరికి నెగిటివ్‌గా తేలినట్లు పేర్కొన్నారు. కరోనా లక్షణాలు ఉంటే వెంటనే కోవిడ్ టెస్టులు చేయించుకోవాలని సూచించారు.

సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తా

చింతల్: దుండిగల్ మున్సిపాలిటీ పరిధిలోని వివిధ గ్రామాల్లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తానని కౌన్సిలర్ కృష్ణ అన్నారు. ఎమ్మెల్సీ శంభీపూర్ సహకారంతో ఇప్పటికే అనేక గ్రామాలలో అభివృద్ధి పనులు చేపట్టామని పేర్కొన్నారు.

'డిజైన్ థింకింగ్'తోనే మంచి భవిష్యత్

సాక్షి, సిటీబ్యూరో: ప్రస్తుత సాంకేతిక యుగంలో వినూత్న ఆలోచనలు కొనసాగించడానికి 'డిజైన్ థింకింగ్' విధానం అనువైనదని, ఈ విధానంతో విద్యార్థులు తమ పరిశోధనలను మరింత ఉన్నతంగా నిర్వర్తించవచ్చని శ్రీనిధి ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ సీఈఓ అభిజిత్‌రావు కటికనేని తెలిపారు. ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్‌పైన నగర విద్యార్థులకు అవగాహన కల్పించడానికి శ్రీనిధి ఇన్‌స్టిట్యూట్, టైటాన్, టింకర్ ల్యాబ్స్ సంయుక్త ఆధ్వర్యంలో 'డిజైన్ థింకింగ్ ఫర్ సోషల్ ఇంపాక్ట్' అనే అంశంపై రెండు రోజుల వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో భాగంగా సాంకేతిక-సామాజిక సమస్యలను పరిష్కరించడంలో ఇన్నోవేషన్, డిజైన్ థింకింగ్ పోషించే కీలక పాత్రపై అవగామాన కల్పించారు. సాంకేతిక ఆవిష్కరణలపై మన్‌దీప్ సింగ్, డిజైన్ థింకింగ్-బిజినెస్ ప్రాబ్లమ్స్ అంశంపై రవి ప్రత్యేక సెమినార్లను నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌లో సంస్థ డైరెక్టర్ వాసుదేవ రావు యల్లపు, ప్రొఫెసర్ సీవీ టామీ, ప్రిన్సిపాల్ డాక్టర్ టీ.సీహెచ్.శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉర్దూ అందమైన, సున్నితమైన భాష

హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్



రాయదుర్గం: ఉర్దూ చారిత్రాత్మక భారతీయ భాష అని హర్యానా అశోకా యూనివర్సిటీ విజిటింగ్ ప్రొఫెసర్ పెగ్గీమోహన్ అన్నారు. శుక్రవారం గచ్చిబౌలిలో మనూ సెంట్రల్ లైబ్రరీ ఆడిటోరియంలో 'ది స్టోరీ అండ్ ప్రీ హిస్టరీ ఆఫ్ ఉర్దూ' అనే అంశంపై ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉర్దూ స్థానిక సంస్కృతిని కలిగి ఉంటుందని, ఇది అందమైన, సున్నితమైన భాష అని పేర్కొన్నారు. వివిధ పేర్లతో పిలిచే కాలంలో ఉర్దూ ఎలా పరిణామం చెందిందో వివరించారు. ఉర్దూలో ఉజ్బెక్ భాష ప్రభావం ఉందని ఆమె పేర్కొన్నారు. వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్‌హసన్ మాట్లాడుతూ ఏ భాష లోనైనా స్థానిక సంస్కృతి చాలా బలంగా ఉంటుందన్నారు. అనంతరం విద్యార్థులతో ప్రొఫెసర్ పెగ్గీమోహన్ ముఖాముఖి నిర్వహించారు. కార్యక్రమంలో దక్కన్ కల్చర్, హెరిటేజ్ నిష్ణాతులు సజ్జద్‌షాహిద్, ప్రొఫెసర్ నసీముద్దీన్ ఫరీస్, ప్రొఫెసర్ సయ్యద్ ఇంతియాజ్ తదితరులు ప్రసంగించారు.

ఇదే మా మొదటి లేఖ..

- బాలయ్యనగర్‌సమస్యలను లేఖలో రాసిన స్థానికులు
- వాటిని ప్రజాప్రతినిధులు, అధికారుల చిరునామాలకు పంపిన వైనం



పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని రాసిన పోస్ట్‌కార్డులను చూపిస్తున్న బస్తీవాసులు

సుభాష్‌నగర్: ఆ బస్తీలో నూతనంగా పోస్ట్ ఆఫీస్ ఏర్పాటైంది. కొన్నేళ్లుగా వారుఎదుర్కొంటున్న సమస్యను పరిష్కరించాలంటూ మొట్టమొదటగా ఆ పోస్ట్ ఆఫీస్ బాక్స్‌లో బస్తీవాసులు కలిసి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులకు ఉత్తరాలు రాసి పంపారు. గాజులరామారం డివిజన్ బాలయ్యనగర్‌లో పెరిగిన ఓటర్లను దృష్టిలో పెట్టుకొని స్థానికంగా ఎన్నికల బూత్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వినూత్న రీతిలో బస్తీలో నూతనంగా ఏర్పాటు చేసిన పోస్ట్ ఆఫీస్ బాక్స్‌లో ఉత్తరాలను గతశనివారం(4వ తేదీన)ఉన్నతాధికారులకు ప్రజాప్రతినిధులకు పంపారు.

◆ నాడు గుడిసెలు... నేడు బంగ్లాలు

బాలయ్యనగర్ 1982లో ఏర్పాటైంది. అప్పట్లో గుడిసెలు వేసుకొని వడ్డెరులు రాళ్లు కొడుతూ నివాసం ఉన్నారు. స్థానికంగా వడ్డెరులే కాకుండా కార్మికులు, ఉద్యోగస్తులు ఇతర రాష్ట్రాలకు చెందిన వారు స్థానికంగా నివాసం ఏర్పాటు చేసుకోవడంతో ఆ బస్తీ మినీ ఇండియాగా రూపాంతరం చెందింది. శరవేగంగా అభివృద్ధి చెందిన కూకట్‌పల్లి హౌసింగ్ బోర్డ్ చెరువులో బాలయ్యనగర్ ఉండటంతో బస్తీ అభివృద్ధి చెందడమే కాకుండా చుట్టుపక్కల కాలనీలో అపార్ట్‌మెంట్లు, బహుళ అంతస్తులనిర్మాణాలు జరగడంతో పూర్తి కాంక్రీట్ జంగల్‌గా మారింది.

◆ పెరిగిన జనాభా...

ఒకప్పుడు నిర్మానుషంగా ఉన్న ఈ ప్రదేశంలో చుట్టూ మహాదేవపురం, కైలాస్‌హిల్స్, షిరిడీహిల్స్, కమలమ్మ కాలనీలు వెలిశాయి. దీంతో పదేళ్ల వ్యవధిలో వేల సంఖ్యలో జనాభాపెరిగింది. దీనికి తోడు వేల సంఖ్యలో ఓటర్లు కూడా పెరిగారు.

◆ ఓటు వేయాలంటే 3 కిలోమీటర్లు వెళ్లాల్సిందే..

పెరిగిన ఓటర్ల దష్ట్యా వారి సౌకర్యార్థం స్థానికంగా ఎన్నికల పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేయడంలో సంబంధిత అధికారులు విఫలమయ్యారు. ఎన్నికల సమయంలో వీరి పోలింగ్ బూత్ నంబర్ అయినా 236,237,238,239లను మూడు కిలోమీటర్ల దూరంలో ఉన్న గాజులరామారం జడ్పీహెచ్ఎస్ పాఠశాలకు వెళ్లి ఓటు హక్కును వినియోగించుకోవాల్సిందే. ఈ విషయమై ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోతున్నారు.

పోలింగ్‌బూత్‌ను ఏర్పాటు చేయాలి



ఓటర్లు తక్కువ ఉన్న ప్రాంతాల్లో సైతం పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేశారు. వేల సంఖ్యలో ఉన్న బాలయ్యనగర్‌లో మాత్రం ఎన్ని సార్లు విన్నవించినా ఏర్పాటు చేయడం లేదు. పోలింగ్ బూత్‌కు మా బస్తీలో అన్ని వసతులు ఉన్నా అధికారులు మాత్రం పట్టించుకోవడం లేదు. వచ్చే ఎన్నికల వరకు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయకుంటే ఎన్నికలను బహిష్కరిస్తాం. - నాగేష్ బాలయ్యనగర్ అధ్యక్షుడు

నడుచుకుంటూ వెళ్లి ఓటేస్తున్నా..



30 ఏళ్ల నుంచి ఇక్కడ ఉంటున్నా. ఎలక్షన్లు వచ్చినప్పుడు గాజులరామారానికి నడుచుకుంటూ వెళ్లి ఓటేస్తున్నా. మా బస్తీలో పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలి. అప్పుడు మా లాంటి ముసలోళ్లకు బాగుంటుంది. - పాపమ్మ, బాలయ్యనగర్

కాలనీల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు



శాసనమండలి విప్ శంభీపూర్ రాజుకు సమస్యను వివరిస్తున్న కాలనీల వాసులు

కుత్బుల్లాపూర్: కాలనీలలో మౌలిక వసతులు కల్పించే దిశగా తన శాయశక్తుల కృషి చేస్తానని శాసన మండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. సుభాష్‌నగర్ డివిజన్ పరిధిలోని సుమారు 11 కాలనీల నుంచి సంక్షేమ సంఘం ప్రతినిధులు, ప్రజలు కార్పొరేటర్ హేమలత సూచన మేరకు ఎమ్మెల్సీని కలిసి తమ గోడును వెళ్లబోసుకున్నారు. కాలనీల్లో రోడ్లు, తాగునీరు, డ్రైనేజీ పనులు చేపట్టాలని కోరారు. వెంటనే అధికారులతో ఫోన్లో మాట్లాడి స్థానిక పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరు చేయించి ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. ప్రగతినగర్‌లో ఇసుక లారీల యజమానులు తమకు స్థల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు. తప్పకుండా పరిశీలిస్తానని వారికి హామీ ఇచ్చారు. అదేవిధంగా చింతల్ డివిజన్‌లో వివిధ సమస్యలను డివిజన్ అధ్యక్షుడు మహమ్మద్ రఫీ ఎమ్మెల్సీని కలిసిన వారిలో ఉన్నారు.

ఆకట్టుకున్న 'ది సస్టెయినబుల్ సిటీస్' ప్రాజెక్ట్స్



నిజాంపేట్: బాచుపల్లి ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌కు చెందిన ఐబీడీసీ-1 విద్యార్థులు తమ గ్రూప్-4 ప్రాజెక్ట్ కోసం ఐదు పర్యావరణ రహితమైన వినూత్న ఉత్పత్తులను సృష్టించారు. పట్టణ సమాజాలకు మరింత మెరుగైన భవిష్యత్తును సృష్టించేందుకు వారు తమ అంకితభావాన్ని ప్రదర్శించారు. పర్యావరణహిత నగరాలు 'ది సస్టెయినబుల్ సిటీస్'అనే థీమ్‌తో ప్రాజెక్ట్‌లను రూపొందించారు. విద్యార్థులు పర్యావరణ అనుకూలతను ప్రోత్సహించడానికి వినూత్న పరిష్కారాలను రూపొందించారు.

◆ ఐదు గ్రూపులు పర్యావరణహిత ప్రాజెక్టులు

మొదటి గ్రూప్ బయోర్యాప్‌ను అభివృద్ధి చేసింది. ఇది 100 శాతం బయోడిగ్రేడబుల్ ఎకో ఫ్రెండ్లీ ప్లాస్టిక్, స్థిరమైన ప్యాకేజింగ్‌కు అనుకూలంగా ఉంది. రెండో గ్రూప్ బ్లాక్ కొబ్బరికాయలు రీసైకిల్ చేయగా వచ్చిన దాని నుంచి స్థిరమైన సిమెంట్‌ను తయారు చేశారు. మూడో గ్రూప్ ఎకోసెల్ ఉపయోగించి కలబందతో సేంద్రీయ బ్యాటరీలను ఉత్పత్తి చేసింది. నాల్గో గ్రూప్ అక్వాజెనీ గృహావసరాల నుంచి వచ్చే మురుగును రీసైక్లింగ్ చేసింది. ఐదో గ్రూప్ సోలార్ స్ప్రౌట్, సమగ్ర సౌర నీటి పారుదల వ్యవస్థను అభివృద్ధి చేసింది.

ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ బల్జీత్ ఓబెరాయ్ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రదర్శించిన అసాధారణమైన ప్రాజెక్టులు ఎంతగానో ఆకట్టుకున్నాయని అన్నారు. ప్రపంచ సమస్యలు పరిష్కారించడానికి చేసిన కృషి అభినందనీయమన్నారు. ఐబీడీపీ విభాగాధిపతి సాయికృష్ణ పమ్మి మాట్లాడుతూ... అన్ని ప్రదర్శనలపై సంతోషం వ్యక్తం చేశారు. జ్ఞానానికి పరిమితులు ఉన్నాయి కాని ఊహకు హద్దులు లేవని అన్నారు. ఈ కార్యక్రమంలో ఇషా, కృష్ణ, అక్షిత్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌టీపీ నుంచి సాతల గోపాల్ సస్పెన్షన్

నిజాంపేట్: మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన సాతల గోపాల్‌ను వైఎస్ఆర్‌టీపీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు జిల్లా అధ్యక్షుడు దేశిరెడ్డి సురేశ్‌రెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. గోపాల్ పార్టీ వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినందుకు పార్టీ అధినేత్రి వైఎస్ షర్మిల ఆదేశాలతో ఆయనను పార్టీ నుంచి సస్పెండ్ చేసినట్లు పేర్కొన్నారు.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఈ-సమ్మిట్ ప్రోత్సాహం



ఈ-సమ్మిట్‌లో పాల్గొన్న ఔత్సాహికులు

కుత్బుల్లాపూర్: ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రత్యేక అవకాశాలను అందించేందుకు మహీంద్రా విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో ఈ-సమ్మిట్ నిర్వహించారు. మార్చి 9, 10వ తేదీలలో హైదరాబాద్‌లో రెండు రోజులపాటు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎక్కువ మంది యువత తమ ఆసక్తిని చూపడంతో పాటు హైదరాబాద్‌లో పెట్టుబడిదారులకు నమ్మకం కలిగిందన్నారు. పారిశ్రామిక వ్యవస్థలో కొత్తగా ప్రవేశించే వారికి మార్గనిర్దేశం చేయడానికి ఈ-సమ్మిట్ మేలు చేస్తుందని తెలిపారు. ఈ-సమ్మిట్ కార్యక్రమంలో పాల్గొనేందుకు వివిధ దేశాల నుంచి వచ్చిన వారి అభిప్రాయాలను వెలిబుచ్చారు. ఈ కార్యక్రమంలో కొత్త కొత్త ఆలోచనలు ఉన్న వారిని ఒకేచోట చేర్చడానికి వేదిక అయ్యిందన్నారు.

◆ ఈ కార్యక్రమంలో నిర్వాహకులు పేరుగాంచిన వెర్చులైజర్ సిరీస్‌ను కార్యక్రమంలో ప్రదర్శించారు. కార్యక్రమంలో భాగంగా అద్భుతమైన స్టార్టప్ షోలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో నిధులు, పెట్టుబడులు వ్యూహాలు సాంకేతిక అభివృద్ధి చెందుతున్న పోకడలు సమాజంలో వాటికి ఉన్న ఆదరణ గురించి వివరించారు. కార్యక్రమంలో అజిత్ రంగ్నేకర్, రేవతిరో షార్క్ పోటీదారులు రవి, అనుజ కబ్రా నిఖిల్ లాంటి ప్రముఖులు వారి సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమానికి పీవీఆర్ లాస్, కోటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంకు మద్దతు అందించాయి.

హెచ్‌సీయూలో ముగిసిన రెండు రోజుల సదస్సు

రాయదుర్గం: హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో సెంటర్ ఫర్ ది స్టడీ ఆఫ్ సోషల్ ఎక్స్‌క్లూజివ్ అండ్ ఇన్‌క్లూజివ్ పాలసీ ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సు శుక్రవారం సాయంత్రం ముగిసింది. ఈ సందర్భంగా అసోసియేట్ ప్రొఫెసర్, సదస్సు కన్వీనర్ డాక్టర్ జే రాణి రత్నప్రభ రచించిన 'భారత దేశంలో అసంఘటిత కార్మికులు: సమస్యలు, సవాళ్లు' అనే పుస్తకాన్ని నోయిడా వివిగిరి లేబర్ ఇన్‌స్టిట్యూట్ డైరెక్టర్ జనరల్ అమిత్‌నిర్మల్ చేతుల మీదుగా ఆవిష్కరించారు.

'మనూ'లో ప్లేస్‌మెంట్ డ్రైవ్


రాయదుర్గం: మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ విశ్వ విద్యాలయంలో శిక్షణ, ప్లేస్‌మెంట్ సెల్ షాహీన్ గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ సహకారంతో ప్లేస్‌మెంట్ డ్రైవ్‌ను మార్చి 13 నుంచి 19వ తేదీ వరకు నిర్వహించడం జరుగుతుందని డాక్టర్ మహ్మద్ యూసుఫ్ ఖాన్ శుక్రవారం తెలిపారు.ఈ ప్లేస్‌మెంట్ కేవలం బీఈడీ, ఎంఈడీ పాసైన విద్యార్థులు (దూరవిధానం)కు అవకాశం ఉంటుందన్నారు.

రూ.999కే డయాలసిస్ సేవలు

హఫీజ్‌పేట్ : కల్వరి టెంపుల్‌లో 999 రూపాయలకే డయాలసిస్ సేవలు అందిస్తున్నామని కల్వరి టెంపుల్ అధినేత బ్రదర్ సతీష్, సునీత్రిలు అన్నారు. శుక్రవారం మియాపూర్ కల్వరి టెంపుల్ ఆసుపత్రిలో నూతనంగా ఏర్పాటు చేసిన డయాలసిస్ సెంటర్‌ను వారు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు సేవ చేయాలన్న మానవత దృక్పథంతో డయాలసిస్ సెంటర్‌ను నెలకొల్పడం జరిగిందన్నారు. ఇప్పటి వరకు కల్వరి టెంపుల్ ఆసుపత్రిలో 55వేల మందికి వైద్యం అందించామని పేర్కొన్నారు.

క్రైం కార్నర్..

దుండిగల్‌లో యువకుడి హత్య



వినయ్ (ఫైల్)

సుభాష్‌నగర్: ఓ యువకుడు దారుణహత్యకు గురైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ రమణారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. వరంగల్ జిల్లా కాశీబుగ్గ ప్రాంతానికి చెందిన లతా, సదానందం భార్యాభర్తలు. వీరికి వినయ్(26) కుమారుడు, రోజీ కుమార్తె ఉన్నారు. వినయ్ మూడు నెలల ముందు ఫ్యాన్‌ల పరిశ్రమలో పనిచేసేవాడు. ఇటీవల ఉద్యోగం మానేసి మద్యానికి బానిసయ్యాడు. ఈనెల 7వ తేదీన రాత్రి 10.30గంటల సమయంలో వినయ్ గాయాలతో ఇంటికి వచ్చాడు. దీంతో తల్లిదండ్రులు వినయ్‌కు ప్రథమ చికిత్స చేయించారు.

◆ 8వ తేదీ తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో వినయ్ స్నేహితులు టామ్, ఉదయ్, ధనుష్‌లతో పాటు మరో ఇద్దరు ఇంటికి వచ్చి పని ఉందంటూ వినయ్‌ను బయటకు తీసుకువెళ్లారు. సెల్‌ఫోన్ ఇంట్లోనే ఉంచి వెళ్లిన వినయ్ ఇంటికి తిరిగి రాలేదు. శుక్రవారం ఉదయం సూరారంలోని జ్యోతి మిల్క్ పరిశ్రమ వెనుక వైపు ఉన్న నిర్జన ప్రదేశంలో గుర్తు తెలియని మృతదేహం పడి ఉందని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు.

◆ ఘటన స్థలానికి చేరుకున్న మేడ్చల్ ఏసీపీ వెంకటరెడ్డి, డీఐ కృష్ణప్రసాద్ మృతదేహం వినయ్‌దిగా గుర్తించారు. అనంతరం వినయ్ తల్లిదండ్రులకు సమాచారం అందించి మృతదేహానికి పంచనామా నిర్వహించి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు. అనుమానస్పద మృతిగా కేసు నమోదు చేసుకున్నారు. వినయ్ మృతదేహంపై కమిలిపోయిన గాయాలను పోలీసులు గుర్తించారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

కుత్బుల్లాపూర్‌లో రెండు పోలింగ్ కేంద్రాలు

కుత్బుల్లాపూర్: రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మేడ్చల్ జిల్లా వ్యాప్తంగా మొత్తం 14 కేంద్రాలను ఎంపిక చేశారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలో రెండు పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు మండల తహసీల్దార్ సంజీవరావు పేర్కొన్నారు. ఈనెల 13న ఎన్నిక జరగనుందని కుత్బుల్లాపూర్ ప్రభుత్వ పాఠశాల ఆవరణలోని రెండు పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశామని తెలిపారు. మొత్తం 1067 ఓటర్లు ఉన్నారని ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటిస్తూ ఓటింగ్‌లో పాల్గొనాలని కోరారు. జిల్లాలో 6536 మంది ఉపాధ్యాయ ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని పేర్కొన్నారు. వారిలో 3038 పురుషులు, 3498 మహిళలు ఉన్నారన్నారు.

నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారం...

మొత్తం 21 మంది అభ్యర్థులు పోటీ పడుతుండగా బీవీఎస్ రెడ్డి తరపున బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, కేంద్రమంత్రి కిషన్ రెడ్డిలు ప్రచారం చేస్తున్నారు. కాంగ్రెస్ బలపరిచిన అభ్యర్థిగా హర్షవర్ధన్‌రెడ్డి పోటీలో ఉన్నారు. వీరితోపాటు సిట్టింగ్ ఎమ్మెల్సీగా ఉన్న కాటేపల్లి జనార్దన్‌రెడ్డి తిరిగి రెండోసారి తన అదృష్టాన్ని పరీక్షించుకునేందుకు సిద్ధమయ్యారు. ఇలా అనేక ఉద్యోగ సంఘాల మద్దతుతో మరికొంత మంది నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఈనెల 11తో ప్రచారం ముగుస్తుంది.

ప్రపంచశాంతికి బ్రహ్మకుమారీస్ కృషి అభినందనీయం



ఎమ్మెల్యే వివేకానంద్‌ను సన్మానిస్తున్న బ్రహ్మకుమారీస్

కుత్బుల్లాపూర్: ప్రపంచశాంతికి బ్రహ్మకుమారీస్ చేస్తున్న కృషి అభినందనీయమని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అన్నారు. ఈ మేరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, గాజులరామారం 125 డివిజన్ పరిధిలోని కైలాష్‌హిల్స్‌లో నూతనంగా నిర్మించిన బ్రహ్మకుమారీస్ శివ జ్యోతి భవన్ ×రాజ్ యోగా మెడిటేషన్ సెంటర్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రపంచ శాంతికి పవిత్ర సందేశమిస్తూ.. అనేక సేవలందిస్తున్న బ్రహ్మకుమారీస్ ఉన్న ప్రతి ప్రాంతం ప్రశాంతంగా ఉంటుందని కొనియాడారు.

చింతల్ డివిజన్‌లో ప్రగతియాత్ర..

చింతల్ 128 డివిజన్ పరిధిలో 'ప్రగతి యాత్ర'లో భాగంగా ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ పర్యటించారు. ఈ మేరకు ఎస్ఎల్‌బీనగర్, పద్మశాలిబస్తీల్లో పాదయాత్ర చేస్తూ అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం మిగిలిన పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఆయా పనులన్నీ త్వరలోనే పూర్తి చేయిస్తానని ప్రజలకు ఎమ్మెల్యే హామీ ఇచ్చారు.

నేటి నుంచి స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్

నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన్ జ్యోతి ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ కాలేజీలో ఈనెల 11 నుంచి 4వ ఆల్ ఇండియా సౌత్ జోన్ ఇంటర్ పాలీటెక్నిక్ స్పోర్ట్స్ అండ్ గేమ్స్ మీట్ 2022-23ను నిర్వహించనున్నట్లు ప్రిన్సిపల్ సీడీ నాయుడు ఓ ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి, సాంకేతిక విద్యాకమిషనర్ నవీన్‌మిట్టల్, ఉన్నత విద్యాశాఖ సెక్రటరీ కరుణ పాల్గొంటారన్నారు.

వేతనాలు చెల్లించాలని ధర్నా

మేడ్చల్: గ్రామ పంచాయతీల్లో నాలుగు నెలలుగా పెండింగ్‌లో ఉన్న తమ వేతనాలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ వివిధ గ్రామాల పంచాయతీ పారిశుద్ధ్య కార్మికులు మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. సీఐటీ యూ ఆధ్వర్యంలో ఎంపీడీఓ కార్యాలయం ప్రధాన ద్వారం ఎదుట బైఠాయించారు. నాలుగు నెలలుగా తమకు జీతాలు ఇవ్వకుండా ఇబ్బందులకు గురి చేస్తున్నారని, తమకు ఎందుకు వేతనాలు ఇవ్వడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26 వేలుగా నిర్ణయించి అమలు చేయాలన్నారు.

యంత్రాలు, రసాయనాలపై అవగాహన కలిగి ఉండాలి



కార్మికులతో మాట్లాడుతున్న జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్

జీడిమెట్ల: పరిశ్రమల్లో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా కార్మికులు జాగ్రత్తలు తీసుకోవాలని జీడిమెట్ల ఇన్‌స్పెక్టర్ పవన్ అన్నారు. 52వ భద్రత వారోత్సవాల సందర్భంగా జీడిమెట్ల ఫేజ్-3లోని సైమెడ్ ల్యాబ్‌లో శుక్రవారం కార్మికులకు భద్రతపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... పరిశ్రమల్లో యంత్రాల వద్ద పని చేసే కార్మికులు సరైన సేఫ్టీ వేర్స్ వేసుకోవాలన్నారు. ప్రతి కార్మికుడు యంత్రాలు, రసాయనాలపై అవగాహన కలిగి ఉన్నప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవించవని కార్మికులకు సలహాలు ఇచ్చారు. అనంతరం వివిధ పరిశ్రమల్లో జరిగిన ప్రమాదాల తీరును కార్మికులకు తెలియజేశారు. పరిశ్రమ యాజమాన్యం సైతం కార్మికుల భద్రతకు కావాల్సిన వస్తువులను సమకూర్చాలని అన్నారు.

మహిళా చైతన్యమూర్తి సావిత్రీబాయి పూలే



సావిత్రీబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మహిళలు

కత్బుల్లాపూర్: ఆడపిల్లల చదువు కోసం నిరంతరం పాటుపడిన మహిళా చైతన్య మూర్తి సావిత్రీబాయి పూలే అని మాజీ వార్డు మెంబర్ ఇంద్రారెడ్డి మంజుల అన్నారు. శుక్రవారం సావిత్రీబాయి పూలే వర్ధంతిని పురస్కరించుకొని జీడిమెట్ల డివిజన్ దుర్గా ఎస్టేట్ మూడు గుళ్ల సమీపంలో ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు. సమాజంలో రుగ్మతలు రూపుమాపడానికి కృషి చేసిన సామాజిక ఉద్యమకారిణి సావిత్రిబాయి అని కొనయాడారు. ఈ కార్యక్రమంలో మాజీ వార్డు మెంబర్ ఇంద్రారెడ్డి మంజుల, సునీత, మహేశ్వరి, సంధ్య, కళ్యాణి, జ్యోతి, పద్మ, శ్వేత, ఆండాలు పాల్గొన్నారు.

పాపన్న మాణిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలి



బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో ప్రచారం చేస్తున్న కేవీపీఎస్ నాయకులు

నిజాంపేట్: మహబూబ్‌నగర్, రంగారెడ్డి, హైదరాబాద్ జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం కేవీపీఎస్ నాయకులు బాచుపల్లి ప్రభుత్వ పాఠశాలలో శుక్రవారం ప్రచారం నిర్వహించారు. పాపన్న మాణిక్‌రెడ్డిని ఎమ్మెల్సీగా గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. కేవీపీఎస్ మేడ్చల్ జిల్లా కార్యదర్శి నాగనిగళ్ల బాలపీరు, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు చంద్రశేఖర్, యూటీఎఫ్ నాయకులు పాండురంగామూర్తి, విజయభాస్కర్‌రెడ్డి, విఠల్, మల్లయ్య, ప్రభాకర్, ప్రియదర్శిని పాల్గొన్నారు.

ఉపనయనం



జీడిమెట్ల: సోమవంశ సాహస్రార్జున క్షత్రియ సమాజ్ ఆధ్వర్యంలో 51 మందికి ఉపనయన కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. శుక్రవారం సుభాష్‌నగర్ పట్కారీ సమాజ్ భవనంలో జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, బీఆర్ఎస్ నాయకులు సురేష్‌రెడ్డి పాల్గొని మాట్లాడారు. ఉపనయనం అనంతరం చిన్నారులు మంచి బుద్ధులతో మెలగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సోమవంశ పెద్దలు, ఉపనయనం పొందిన చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.